సాక్షి
నంద్యాల
మంగళవారం । 18 । జూలై । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఎ.నాగరాజు రూ.1,00,116లు విరాళం అందజేశారు. దాతకు జ్ఞాపికతో సత్కరించారు.



క్షేత్రపాలకుడికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకునిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ బయలువీరభద్ర స్వామి వారికి సోమవారం అమావాస్య సందర్భంగా పరోక్ష సేవ, విశేషపూజలు నిర్వహించారు.



ఆశల ప్రవాహం!

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర, కృష్ణా నదులపై నిర్మించిన జలాశయాలకు నీటి ప్రవాహాలు మొదలయ్యాయి. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ..8లో

న్యూస్‌రీల్

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలు

శ్రీశైలంటెంపుల్: శివునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం, అమావాస్య ఘడియల నేపథ్యంలో శ్రీశైల క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఉభయతెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో పుర వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే పవిత్ర పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించి స్వామిఅమ్మవార్ల దర్శనార్థం క్యూలలో వేచి ఉన్నారు. అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయాధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.మల్లికార్జునను సస్పెండ్ చేస్తూ దేవస్థానం ఈఓ లవన్న సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల మల్లికార్జున కొందరిని టిక్కెట్ లేకుండా అమ్మవారి ఆలయం వెనుక హరిహరాయ గోపురం ద్వారా దర్శనానికి తీసుకువెళ్లారు. దేవస్థానం సీఎస్ఓ అయ్యన్న ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ జరిపించిన ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. సంజాయిషీ అనంతరం క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ప్రముఖ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.6 లక్షలు వసూలు చేసి మోసం చేశాడని హెచ్ఎస్ కొట్టాల గ్రామానికి చెందిన ఇద్దరు నిరుద్యోగులు ఎస్పీ రఘువీర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రంలోని టీటీడీ రోడ్డులో ఉయ్యాలవాడ మండలం పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ కార్యాలయం ఏర్పాటు చేశాడు. హైదరాబాద్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆరు నెలల క్రితం హెచ్ఎస్ కొట్టాల గ్రామానికి చెందిన హైమావతి, శ్రీకాంత్‌రెడ్డి నుంచి రూ. 6 లక్షలు వసూలు చేశాడు. ఇప్పటి వరకు ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయం ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 120 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుల్లో చట్టపరమైనవి అక్కడిక్కడే పరిష్కరించామని, మిగతావి విచారణ నిమిత్తం ఆయా స్టేషన్ పరిధిలోని అధికారులకు పంపామన్నారు. కార్యక్రమంలో తాలుకా సీఐ దస్తగిరిబాబు, ఎస్‌బీ ఎస్ఐ సూర్యమౌళి తదితరులు పాల్గొన్నారు.



తోడుగా నిలిచి.. తోడ్పాటును అందించి!

రోడ్డు పక్కన తోపుడు బండి మీద..ఇంటి సమీపంలో బడ్డీ కొట్టులో చిరు వ్యాపారం చేసే వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఫైనాన్స్ కంపెనీల వద్దకు వెళ్లి అధిక వడ్డీలతో రుణాలు తీసుకుని, వాటిని చెల్లించలేక అష్టకష్టాలు పడకుండా జగనన్న తోడు పథకాన్ని అమలు చేస్తోంది. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు వడ్డీని రీయింబర్స్ చేస్తోంది. మంగళవారం ఏడో విడత వడ్డీ రాయితీ విడుదల కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించనున్నారు.

- చిరు వ్యాపారులకు భరోసా ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు
- ఇప్పటి వరకు ఆరు విడతలుగా రుణాలు, వడ్డీ రాయితీ పంపిణీ
- నేడు ఏడో విడత రూ.1.02 కోట్ల వడ్డీ రాయితీ విడుదల
- ఉమ్మడి జిల్లాలో 38,207 మందికి లబ్ధి

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(న్యూటౌన్):చిరు వ్యాపారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోంది. జగనన్న తోడు పథకం కింద బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తోంది. రుణాలు సక్రమంగా చెల్లించే వారికి వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లో వేలాది మంది మహిళలు చిరు వ్యాపారాల్లో రాణిస్తున్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు డీఆర్‌డీఏ-వైకేపీ, పట్టణ ప్రాంతాలకు చెందిన వారికి మెప్మా ద్వారా ప్రతి ఆరు నెలలకు ఒకసారి వడ్డీ రాయితీ లభిస్తోంది. ఇప్పటి వరకు ఆరు దఫాలుగా ప్రభుత్వం చిరు వ్యాపారులకు వడ్డీ రాయితీ ఇచ్చింది. తాజా మంగళవారం 7వ విడత వడ్డీ రాయితీ విడుదల చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి ప్రారంభించనున్నారు. నంద్యాల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా మనజీర్ జిలానీ శామూన్, ప్రజా ప్రతినిధులు, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ, మున్సిపల్ కమీషనర్ పాల్గొననున్నారు.

ఉమ్మడి జిల్లాకు రూ.1.02 కోట్ల వడ్డీ రాయితీ

ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఏడో విడత కింద రూ.1,02,91,886 వడ్డీ రాయితీ విడుదల కానుంది. కర్నూలు, నంద్యాల జిల్లాలో 38,207 మంది చిరు వ్యాపారులు లబ్ధిపొందుతున్నారు. కర్నూలు జిల్లాలో గ్రామీణ ప్రాంత చిరు వ్యాపారులు 13,476 మందికి రూ.37,45,130, పట్టణ ప్రాంత చిరువ్యాపారులు 7,040 మందికి రూ.19,56,454 వడ్డీ రాయితీ లభిస్తోంది. నంద్యాల జిల్లాకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 11,620 మంది చిరు వ్యాపారులకు రూ.37,45,130, పట్టణ ప్రాంతాల్లో 6,071 మందికి రూ.15,75,127 వడ్డీ రాయితీ విడుదల కానుంది.



జగనన్న తోడు కింద బ్యాంకుల నుంచి రుణాలు పొంది ఉపాధి పొందుతున్న దృశ్యం

రానున్న 6 నెలల్లో రూ.45.40 కోట్ల రుణాలు

రానున్న రోజుల్లో చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా మరింత పెద్ద ఎత్తున రుణాలు పంపిణీ చేయనున్నారు. ఇందుకు ప్రభుత్వం లక్ష్యాలను కూడా నిర్దేశించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వచ్చే అరు నెలల్లో 42,159 మంది చిరు వ్యాపారులకు రూ.45.40 కోట్లు రుణాలు పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చింది. కర్నూలు జిల్లాకు సంబంధించి డీఆర్‌డీఏ-వైకేపీ ద్వారా 12,692 మందికి రూ.13.66 కోట్లు, మెప్మా ద్వారా 11,193 మందికి రూ.12.05 కోట్లు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించనున్నారు. నంద్యాల జిల్లాలో డీఆర్‌డీఏ-వైకేపీకి సంబంధించి 12,737 మందికి రూ.13.71 కోట్లు, మెప్మాకు సంబంధించి 5,537 మందికి రూ.5.96 కోట్ల రుణాలు బ్యాంకులు పంపిణీ చేయున్నాయి. రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తోంది.

నియోజకవర్గాల వారీగా వడ్డీ రాయితీ విడుదల ఇలా..

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	వడ్డీ రాయితీ (రూపాయల్లో)
ఆళ్లగడ్డ	2,793	7,24,427
బనగానపల్లె	2,398	6,22,295
శ్రీశైలం	2,298	5,96,302
డోన్	2,803	7,27,407
పాణ్యం (గడివేముల, పాణ్యం)	765	1,98,376
నందికొట్కూరు	2,654	6,88,651
నంద్యాల	3,980	10,32,798
మొత్తం	17,691	4590302
అర్బన్ ప్రాంతాల్లో..		
ఆళ్లగడ్డ	695	1,80,205
ఆత్మకూరు	645	1,67,432
డోన్	896	2,32,574
నందికొట్కూరు	766	1,98,232
నంద్యాల	3,069	7,96,232

ఎంతో మేలు



చిరువ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోంది. బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తూ.. సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేస్తోంది. ఇప్పటి వరకు ఆరు విడతలుగా ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి, వడ్డీ రాయితీ అందించింది. రానున్న రోజులు చిరువ్యాపారులకు బ్యాంకుల ద్వారా పెద్ద ఎత్తున రుణాలు పంపిణీ చేయనున్నాం.

-శ్రీధర్‌రెడ్డి డీఆర్‌డీఏ, పీడీ

చాలా సంతోషం



నేను కర్నూలు నగరంలోని శరీన్‌నగర్‌కు చెందిన భవాని గ్రూపులో సభ్యురాలిగా ఉన్నా. చీరల వ్యాపారం ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నా. జగనన్న తోడు పథకం కింద కృష్ణానగర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో అప్పు తీసుకున్నా. నిబంధనల ప్రకారం చెల్లించా. ప్రభుత్వం మంగళవారం బ్యాంకు ఖాతాకు వడ్డీ రీయిబర్స్‌మెంట్ చేస్తుండటం చాలా సంతోషంగా ఉంది. జగనన్న తోడు కింద మరోసారి రుణం తీసుకుని అవకాశం కూడా కల్పించారు.

- జానకి, శరీన్ నగర్, కర్నూలు

జగనన్న సురక్ష క్యాంపులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జగనన్న సురక్ష క్యాంపులకు కొంతమంది నియోజకవర్గ స్పెషల్ అధికారులు, మండల స్థాయి బృందాలు మొక్కుబడి రీతిలో హాజరవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో కలెక్టరుతో పాటు డీఆర్‌ఓ పుల్లయ్య, జిల్లాధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న జగనన్న సురక్ష క్యాంపులకు హాజరై సర్వీస్ రిక్వెస్టులను క్లియర్ చేయాలన్నారు. అలాగే స్థానికంగా ఉన్న కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి చేపట్టాల్సిన అంశాలపై సిఫారసు చేయాలని నియోజకవర్గ స్పెషల్ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందాలకు సూచించారు. అప్పగించిన విధుల్లో అలసత్వం చూపే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు వెనుకాడమన్నారు. జగనన్నకు చెబుదాం ఆడిట్‌లో పెండింగ్‌లో ఉన్న 959 ఈకేవైసీని నియోజకవర్గాల వారీగా విభజించి మూడు రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడి ఈడు పిల్లల నమోదుకు సంబంధించి వలంటీర్లు, విద్యాశాఖ చూపిస్తున్న నమోదు మిస్ మ్యాచ్ ఉన్న నేపథ్యంలో ఎంఈఓ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, సంబంధిత వలంటీర్లు కో-ఆర్డినేట్ చేసుకుని క్లియర్ చేయాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీకి సంబంధించి రివైజ్డ్ టార్గెట్లు ఇచ్చారని ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న 49 శాతం సీసీఆర్‌సీ కార్డుల జారీకి రైతు భరోసా కేంద్రాల వారీగా చర్యలు తీసుకోవాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ఇంకా ప్రారంభించని 131 పనులు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో వచ్చిన 225 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి బంగారు హారం బహూకరణ

బనగానపల్లె: నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పీఆర్ తుల సీశ్వరరెడ్డి, పీఎల్ నరసింహారెడ్డి కుటుంబీకులు సోమవారం బంగారు ఆభరణాన్ని బహూకరించారు. రూ.5.32 లక్షల విలువైన హారాన్ని దాతలు ఆలయ ఈఓ రామానుజన్‌కు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బంగారు ఆభరణాన్ని ఈఓకు అందజేస్తున్న దాతలు (ఇన్‌సెట్లో) బంగారు ఆభరణం

స్కూళ్లలో టీచర్ల కొరత లేకుండా చర్యలు

- పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం



సమావేశంలో మాట్లాడుతున్న మువ్వా రామలింగం

కర్నూలు సిటీ: ప్రభుత్వ స్కూళ్లలో టీచర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్(సర్వీసెస్) మువ్వా రామలింగం ఆదేశించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు సోమవారం కర్నూలులో విద్యాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. మున్సిపల్ స్కూళ్లలో వారం రోజుల్లో టీచర్లను సర్దుబాటు చేయాలన్నారు. ఎస్‌జీటీల్లో బీఈడీ ఉన్న వారిని హైస్కూళ్లలో సర్దుబాటు చేయాలన్నారు. హైస్కూళ్లలో ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంట్‌తో గణితం కూడా చెప్పించాలన్నారు. ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాల య అధికారి వెంకట కృష్ణారెడ్డి, డీఈఓ రంగారెడ్డి, ఏడీ శ్యాముల్ పాల్, డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, ఎంఈఓలు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల తనిఖీ

జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'జీవన నైపుణ్యం' అనే అంశంపై జరుగుతున్న రెండో విడత శిక్షణ తరగతులను విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం తనిఖీ చేశారు.

శ్రీరాముడి విగ్రహ శంకుస్థాపన 24కు వాయిదా

మంత్రాలయం రూరల్: పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో 108 అడుగుల శ్రీరాముడి కాంస్య విగ్రహ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసినట్లు రాఘవేంద్రస్వామి మఠం అధికారులు, జైశ్రీరామ్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎంపీ శ్రీధర్, కే రాములు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో వర్చువల్‌గా శంకుస్థాపన చేయాల్సి ఉందని, మంత్రికి ముఖ్యమైన సమావేశం ఉండటంతో కార్యక్రమాన్ని వాయిదా వేశామని తెలిపారు.

పవన్ కల్యాణ్‌వి చిల్లర రాజకీయాలు

- కోవిడ్ సమయంలో చంద్రబాబు, పవన్ ఎక్కడ దాక్కున్నారు
- సీఎంకు మంచి పేరు వస్తుందనే దిగజారుడు ఆరోపణలు
- జగనన్న సురక్షతో వంద శాతం అర్హులకు సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, చిత్రంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

నంద్యాల: జనసేన అధినేత పవన్ కల్యాణ్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. సోమవారం పట్టణంలోని ఎంపీ పోచా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో గ్రామ స్వరాజ్యం సాధ్యమైందన్నారు. వలంటీర్ల సేవలతో సీఎంకు మంచి పేరు వస్తుండటంతో జీర్ణించుకోలేక చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలకు ఎదురొడ్డి సేవలు అందజేస్తున్న సమయంలో పవన్ కల్యాణ్, చంద్రబాబు ఎక్కడ దాక్కున్నారో చెప్పాలని, ఆరోజు వలంటీర్లపై ఎందుకు నోరు విప్పలేదని ప్రశ్నించారు. పేదలకు చిత్తశుద్ధితో సేవలు అందిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. అర్హత ఉన్న 99 శాతం మందికి సంక్షేమ పథకాలు అందాయని, సాంకేతిక కారణాలతో లబ్ధి పొందని ఒక శాతం లబ్ధిదారులు కూడా న్యాయం చేయాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. సమావేశంలో నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, శాంతిరాం విద్యాసంస్థల అధినేత మిద్దె శివరాం, వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ అనిల్‌అమృతరాజ్, తదితరులు పాల్గొన్నారు.

- ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం కింద 47,30,423 సర్టిఫికెట్లను ప్రజలకు అందించామన్నారు. ఈనెల 30వ తేదీలోపు సంక్షేమ పథకాలకు అర్హులైన అందిరికీ సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. వలంటరీ వ్యవస్థ ప్రతి కుటుంబాన్ని సొంత కుటుంబంలా భావిస్తూ సేవలు అందిస్తుంటే జీర్ణించుకోలేని పవన్‌కల్యాణ్, చంద్రబాబు వారిపై విమర్శలు చేస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. వలంటీర్లు కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. కరోనాతో చనిపోయిన వ్యక్తి దహన సంస్కారాలకు కుటుంబీకులు, బంధువులు ముందుకు రాకపోయినా వలంటీర్లే చేశారన్నారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు మాటల్లో అర్థం, న్యాయం లేవని విమర్శించారు. బాధ్యత లేని రాజకీయాలు చేసే వారు మనుగడ సాగించలేరని హితవు పలికారు.
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలు టీడీపీ వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందించేలా పని చేశాయని, నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలు, కులాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు ఆగిపోకూడదని, జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజల వద్దకే వెళ్లి 11రకాల ధ్రువీకరణ పత్రాలు ఒకే రోజులో అందిస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని, ఎక్కువ శాతం వలంటీర్లు మహిళలే ఉన్నారని, కనీస అవగాహన లేకుండా చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. గౌరవ వేతనంతో స్వచ్ఛందంగా పని చేస్తున్న వలంటీర్లను అవమానించడం పవన్, చంద్రబాబు దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు.
- ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మంచి జరిగితేనే వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేయండి అని చెబుతున్న నాయకుడు దేశంలో జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. ఇలాంటి ప్రభుత్వంపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు వారికి నోటికి వచ్చిన విధంగా మాట్లాడుతున్నారన్నారు. ప్రజలు వారి మాటలు నమ్మే పరిస్థితిలో లేరని, ప్రభుత్వంపై ప్రజలకు వస్తున్న విశేష ఆదరణ చూసి వారు ఓర్వలేకపోతున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సోమవతి అమావాస్య పూజలు



కొత్తపల్లి: సప్తనది సంగమేశ్వరాలయంలో సోమవారం అమావాస్యను పురస్కరించుకొని సోమవతి అమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ వేపధారు శివ లింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, మహాన్యాసపూర్వక, బిల్వార్చన, పుష్పార్చన, రుద్రాభిషేకం, కుంకుమార్చన, మంగళహారతి వంటి విశేషపూజలు నిర్వహించారు. గర్భాలయంలోని లలితాదేవిని కూరగాయాలతో శాఖాంబరి దేవిగా అలంకరించి పూజలు చేశారు. బుక్కాపురం గ్రామ భక్తులచే భజన కార్యక్రమం నిర్వహించారు. గుమ్మడాపురం, కొణిదెల గ్రామాలకు చెందిన భక్తులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి




మృతి చెందిన ఉసేన్‌వలి

కోవెలకుంట్ల: స్థానిక సంతపేటకు చెందిన ఓ యువకుడు సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన ఉసేన్‌వలి(28) అనే యువకుడు గౌండా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాబానగర్‌లో గౌండా పనిచేస్తుండగా ప్రమాదశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సహ కూలీలు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య హసీనా, కుమారుడు ఉసేన్‌బాషా ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆశల ప్రవాహం!

- తుంగభద్ర డ్యామ్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- ప్రస్తుతం 10 టీఎంసీల నీరు నిల్వ
- ఆల్మట్టి డ్యామ్‌కు స్వల్పంగా పెరుగుతున్న వరద
- కృష్ణా, తుంగభద్ర జలాలపై ఆధారపడిన ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు
- నెలాఖరుకు ప్రాజెక్టులు నిండే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అంచనా



తుంగభద్ర జలాశయం

కర్నూలు సిటీ: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర, కృష్ణా నదులపై నిర్మించిన జలాశయాలకు నీటి ప్రవాహాలు మొదలయ్యాయి. దీంతో జిల్లాలోని ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నదుల్లో సుమారు ఎనిమిది నెలలుగా నీటి ప్రవాహం నిలిచిపోవడంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టం అడుగంటింది. అయితే నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నీటి ప్రవాహం మొదలు కావడంతో డ్యాంలలో నీటిమట్టం పెరుగుతోంది. తుంగభద్ర, కృష్ణా నదుల జలవనరులపై ఆధారపడి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది.

ఖరీఫ్‌కు ఢోకా లేదు

ఈ ఏడాది దేశంలో విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తర భారత దేశంలో భారీ వర్షాలతో వరద నీటితో నదులు పొటెత్తుతుంటే...దక్షిణ భారత దేశంలో మాత్రం నదుల్లో నీటి ప్రవాహం ఆశించిన స్థాయిలో లేదు. ప్రతి ఏటా తుంగభద్రనది, కృష్ణానదికి ముందుగా వరదలు వచ్చేవి. అయితే ఈసారి మాత్రం రెండు నదుల్లో ఆశించిన స్థాయిలో నీటి లభ్యత లేదు. ఈ ప్రభావం ఖరీఫ్ పంటల సాగుపై ప్రభావం చూపకపోచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నెల చివరిలోపు కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నిండే అవకాశం ఉన్నట్లు సీడబ్ల్యూసీ(సెంట్రల్ వాటర్ కమీషన్) అంచనా వేసింది.

ఎగువ రాష్ట్రాల్లోని నీటి లభ్యతపై ఆశలు

జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేవు. కృష్ణా, తుంగభద్ర జలాలపై ఆధారపడి ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఎగువ రాష్ట్రాల్లో కురిసే వర్షాలపైనే ఆయకట్టు సాగు ఆధారపడి ఉంది. తుంగభద్ర, కృష్ణా జలాలపై ఆధారపడి తుంగభద్ర దిగువ కాలువ కింద 1.51 లక్షలు, ఆలూరు బ్రాంచ్ కెనాల్ కింద 14 వేలు, కర్నూలు-కడప కాల్వ కింద 2.65 లక్షలు, తెలుగుగంగ కాలువ కింద 1.08 లక్షలు, ఎస్ఆర్‌బీసీ కింద 1.53 లక్షల ఆయకట్టు సాగవుతోంది. సిద్ధాపురం ఎత్తిపోతల పథకం కింద 23 వేలు, పులికనుమ రిజర్వాయర్ పరిధిలో 24 వేలు, పులకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 9 వేలు, గురురాఘవేంద్ర స్కీమ్ ద్వారా 40 వేల ఎకరాలకు నీరు అందుతోంది. హంద్రీనీవా ద్వారా 80 వేల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో 10 (పూర్తి స్థాయి సామర్థ్యం 105 టీఎంసీలు), ఆల్మట్టిలో 33.72 టీఎంసీల(పూర్తి స్థాయి సామర్థ్యం 123 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

54 టీఎంసీల కేటాయింపు

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర డ్యాం. 105 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ డ్యాం నుంచి ఈ ఏడాది రాయలసీమకు 54 టీఎంసీలు కేటాయించారు. అనంతపురం జిల్లాలోని ఎగువ కాల్వల(హెచ్చెల్సీ)కు 32 టీఎంసీలు, భైరవానితిప్పకు 4 టీఎంసీలు, కర్నూలు జిల్లాలో దిగువ కాలువ(ఎల్ఎల్‌సీ)కు 24 టీఎంసీలు, ఆర్డీఎస్ కుడి కాలువకు 4 టీఎంసీలు, కేసీ కాల్వకు 10 టీఎంసీల నికర జలాల వాటా ఉంది. మొత్తం 74 టీఎంసీల నీరు రాయలసీమ జిల్లాలకు రావాల్సి ఉంది. అయితే డ్యాంలో పూడిక చేరిందనే కారణంతో 132 టీఎంసీల సామర్థ్యాన్ని 105 టీఎంసీలకు తగ్గించారు. ఈ ఏడాది నీటి లభ్యత 175 టీఎంసీలకు అంచనా వేసి హెచ్ఎల్‌సీకి 26.828 టీఎంసీలు, ఎల్ఎల్‌సీకి 19.811 టీఎంసీలు, కర్నూలు-కడప కాలువకు 8.255 టీఎంసీలు కేటాయించారు.

స్నేహితుల ఘర్షణ.. ఒకరు మృతి

- మద్యం కోసం డబ్బు అడగడంతో వివాదం
- మృతిని కుటుంబానికి న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు



పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన మృతుని కుటుంబ సభ్యులు



మృతి చెందిన దుబ్బారి ఈరన్న

కోసిగి: స్నేహితుల మధ్య ఘర్షణ చోటుచేసుకుని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన నేలకోసిగి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి గ్రామంలోని సుంకులమ్మ గుడి దగ్గర దుబ్బారి ఈరన్న (25), అతని స్నేహితుడు బసవరాజులు కూర్చొని ఉన్నారు. మద్యం సేవించి ఉన్న బసవరాజు ఇంకా మద్యం కోసం రూ.100 ఇవ్వమని ఈరన్నను అడిగాడు. ఇందుకు లేవని చెప్పగా ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఈరన్నను గొంతు పట్టుకుని నులిమి కింద పడేయడంతో తలభాగంలో రక్తగాయమై అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. చుట్టు పక్కల వారు గమనించి ఈరన్నను కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతిని తల్లి అబ్బారి అంబమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతిని భార్య రామాంజినమ్మ దివ్యాంగురాలు. ఆరు నెలల గర్భిణి. సోమవారం మధ్యాహ్నం పోస్టుమార్టం అనంతరం మృతిని భార్య, బంధువులు మృతదేహాన్ని నేరుగా కోసిగి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. నిందితుడి శిక్షిస్తామని, బాధితురాలికి న్యాయం చేస్తామని ఎస్ఐ సతీష్ కుమార్ చెప్పడంతో శాంతించి మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు

- రూ.7.20 లక్షల విలువ చేసే సొత్తు రికవరీ

కర్నూలు: కర్నూలులోని వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఎం.అబ్దుల్ ఖాదర్ ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. అబ్దుల్ ఖాదర్ నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని హెచ్‌హెచ్ ప్లాజా ప్లాట్ నెం.3లో నివాసముంటున్నాడు. ఈనెల 6న ఇల్లు ఖాళీ చేసి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. సామాన్లు సర్దుకునే సమయంలో బంగారు, వెండి వస్తువులు ఉన్న బ్యాగును ఇంట్లోనే మర్చిపోయి వెళ్లారు. తిరిగి 10వ తేదీ హైదరాబాద్ నుంచి కర్నూలుకు వచ్చి చూడగా బంగారు, వెండి వస్తువులున్న బ్యాగు కనిపించలేదు. దీంతో మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించారు. కర్నూలు పాతబస్తీలోని మేదరి వీధికి చెందిన కనిక వెంకటేశ్వర్లుగా గుర్తించి కిసాన్ ఘాట్ స్విమ్మింగ్‌పూల్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.7.20 లక్షల విలువ చేసే 12 తులాల బంగారు నగలు, 37 గ్రాములు వెండి వస్తువులను రికవరీ చేశారు. రికవరీ విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన క్రైం పార్టీ సిబ్బందిని మూడవ పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి అభినందించారు.

రూ.30లక్షల బంగారు నగలు చోరీ

- చెన్నై నగల వ్యాపారిని ఏమార్చి మాయం చేసిన దొంగలు

ఆత్మకూరు రూరల్/పాములపాడు: పట్టణంలోని పలు అంగళ్లలో నగలు విక్రయించేందుకు వచ్చిన ఒక వ్యాపారి నుంచి సుమారు రూ.30 లక్షల విలువైన నగలను దొంగిలించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలివీ.. తమిళనాడు రాష్ట్రం తిరుచావల్లి పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి గోపాల్ గుణశేఖరన్ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు పట్టణాలలో నగల దుకాణాలకు కమ్మలు, ముక్కురాళ్ళు, రింగులు వంటి చిన్న సైజ్ బంగారు ఆభరణాలు సరఫరా చేస్తుంటాడు. అందులో భాగంగా ఆదివారం ఆయన ఆత్మకూరు పట్టణం చేరుకున్నారు. సుమారు 5 కేజీల బంగారు నగలతో వచ్చిన ఆయన పలు దుకాణాలకు నగలను విక్రయించారు. ఆదివారం 12.15 సమయంలో కర్నూలు వెళ్ళేందుకు ఆత్మకూరు బస్టాండ్‌లో విజయవాడ-కర్నూలు బస్సు(ఏపీ16 జెడ్06322)లో ఎక్కాడు. బస్సు పాములపాడుకు వెళ్లేలోగా నగల బ్యాగు కనిపించకపోవడాన్ని వ్యాపారి గమనించి పెద్దగా కేకలు వేసి బస్సును ఆపాడు. ఎవరో పాములపాడులో బ్యాగ్‌తో బస్సు దిగి వెళ్లాడన్న సమాచారంతో ఆయన పాములపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించాడు. సుమారు రూ.30 లక్షల విలువైన నగలు చోరీకి గురికావడంతో ఆత్మకూరు పోలీసులు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. పలు నగల దుకాణాల వద్ద ఉన్న సిసి కెమెరాలను పరిశీలించిన దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించారు. నలుగురు వ్యక్తులు నగల వ్యాపారిని ఉదయం నుంచే అనుసరించినట్లు తెలుస్తోంది. వీరు కూడా స్థానికులు కాదనే విషయం గుర్తించిన పోలీసులు.. ఆ మేరకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

విరుపాపురంలో యువకుడి ఆత్మహత్యాయత్నం

- పోలీసుల వేధింపులే కారణమా?



చికిత్స పొందుతున్న యువకుడు రఫీక్

ఆలూరు/ఆలూరు రూరల్: హాలహర్వి మండలం విరుపాపురం గ్రామానికి చెందిన రఫీక్ అనే యువకుడు సోమవారం పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇందుకు పోలీసుల వేధింపులే కారణమని యువకుడి తండ్రి లతీఫ్ తెలిపారు. వివరాలు ఇవీ.. గ్రామానికి చెందిన గాదిలింగప్ప, రఫీక్ స్నేహితులు. తాను ప్రేమించిన యువతితో గాదిలింగప్ప ఊరు విడిచి వెళ్లిపోయాడు. యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జూన్ 23వ తేదీన మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు దర్యాప్తులో భాగంగా రఫీక్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. తన కుమారుడిని కొట్టొద్దని గతంలో హాలహర్వి పోలీసులకు రూ.30 వేలు ఇచ్చినట్లు లతీఫ్ తెలిపారు. అయినా ఆదివారం రాత్రి ఏఎస్ఐ ఇంద్రుడు ఫోన్ చేసి విచారణ కోసం స్టేషన్‌కు రావాలని చెప్పాడని, ఎలాంటి వేధింపులకు గురికావాల్సి వస్తుందో అని మనస్తాపం చెందిన తన కుమారుడు సోమవారం ఉదయం ఇంట్లో పురుగు మందుతాగాడన్నారు. రఫీక్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఆదోనికి రెఫర్ చేశారు. ఈ ఘటనపై ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. హాలహర్వి పోలీసులు రఫీక్‌ను వేధిస్తున్నారని తన దృష్టికి రాలేదన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విచారణ చేపట్టిన డీఎస్పీ

పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి సోమవారం సాయంత్రం హాలహర్వి పోలీసు స్టేషన్‌కు చేరుకుని రఫీక్ ఆత్మహత్యాయత్నం ఘటనపై విచారణ చేపట్టారు. గ్రామ సర్పంచ్ సిద్ధమ్మ కుమారుడు మల్లికార్జున, మరికొందరు గ్రామస్తులను స్టేషన్‌కు పిలించిన విచారిస్తున్నారు. గతంలో పనిచేసిన ఎస్ఐ విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ గిడ్డయ్య గౌడ్, ఏఎస్ఐ ఇంద్రుడు ప్రమేయం ఎంత మేరకు ఉందో అని విచారిస్తున్నట్లు సమాచారం.

ఆన్‌లైన్ యాప్‌లో మోసం

- స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు



ఎస్పీ కృష్ణకాంత్‌కు సమస్యలు చెప్పుకుంటున్న వృద్ధుడు

కర్నూలు: కెనడియన్ సోలార్ ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు డిపాజిట్ చేస్తే రెట్టింపు మొత్తం తిరిగి ఇస్తామని చెప్పి మోసం చేశారని కర్నూలు బుధవార పేటకు చెందిన అర్పుత్ ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. రూ.2.85 లక్షలు ఆన్‌లైన్‌లో తన చేత డిపాజిట్ చేయించుకుని రూ.13 లక్షలు వస్తాయని మోసం చేశారని, సంఘటనపై విచారణ జరిపి తగు న్యాయం చేయాల్సిందిగా అర్పుత్ ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదులన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని బాధితులకు ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ యుగంధర్ బాబు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందనలో ఫిర్యాదులను స్వీకరించారు.

రూ.28కోట్ల ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

- నంద్యాల పార్లమెంట్ పరిధి అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల
- అవాస్తవాలు ఉంటే బహిరంగ చర్చకు సిద్ధం
- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల(అర్బన్): గడిచిన నాలుగేళ్లలో నంద్యాల పార్లమెంట్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తెలిపారు. రూ.28 కోట్ల ఎంపీ ల్యాండ్స్ నిధులతో వివిధ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో సోమవారం ఆయన ఇందుకు సంబంధించిన శ్వేత పత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి పనులపై అవాస్తవాలు ఉంటే బహిరంగ చర్చకు సిద్ధమన్నారు.

- ➡ కోవిడ్ సమయంలో ఎంపీ ల్యాండ్స్ కింద రూ.20 లక్షలు ఆసుపత్రులకు ఇచ్చామన్నారు. అదే సమయంలో పోలీసుల సంక్షేమానికి రూ.50 లక్షలతో పాటు సొంత నిధులు రూ.25 లక్షలు ఇచ్చామన్నారు.
- ➡ మాస్క్‌లు, శానిటైజర్లు, పండ్ల పంపిణీకి రూ.50 లక్షలు ఇచ్చామన్నారు.
- ➡ కోవిడ్ సమయంలోనే రైతుల నుంచి దాదాపు 10 లారీల అరటి పండ్లను సొంత నిధులతో కొనుగోలు చేసి ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు పంపిణీ చేశామన్నారు.
- ➡ రూ.90 లక్షల సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులకు ఆక్సిజన్ ప్లాంట్, ప్రభుత్వ కళాశాలలకు హాళ్ల నిర్మాణం, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు.
- ➡ రూ.కోటితో మహానంది పుణ్యక్షేత్రంలో ఫంక్షన్ హాల్ నిర్మించామన్నారు.
- ➡ నంద్యాల శ్మశాన వాటికకు రూ.5 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులు ఇచ్చామని చెప్పారు.
- ➡ రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో పీఎంజీఎస్వై కింద ఆర్.పాంపల్లెలో రూ.5కోట్లతో బ్రిడ్జి నిర్మాణం, కొండుపల్లె-ఉయ్యాలవాడ రహదారికి పీఎంజీఎస్వై కింద రూ.5.7కోట్లతో నిర్మాణ పనులు చేపట్టామన్నారు.
- ➡ రైతుల క్రాప్ ఇన్సురెన్స్‌కు కృషి చేయడమే కాకుండా శనగ పంటకు మార్కెట్ ధరకు అదనంగా క్వింటాకు రూ.1,500 ప్రభుత్వం నుంచి ఇప్పించామని చెప్పారు.
- ➡ 300 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.కోటి, పీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 30 మందికి రూ.90 లక్షలు ఇప్పించామని చెప్పారు.
- ➡ పార్లమెంట్ పరిధిలో ఐదు గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేశామన్నారు. చాబోలులో రూ.కోటితో అభివృద్ధి పనులు, పారుమంచాలలో రూ.30 లక్షలు, బోడెమ్మనూరు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గోవిందపల్లెలో రహదారులు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, గ్రామ అభివృద్ధికి రూ.1.90 కోట్లు వెచ్చించామన్నారు.

సెల్ ఫోన్ల దొంగల అరెస్టు

- మూడేళ్లలో 2,500 సెల్‌ఫోన్లు అపహరించి విక్రయించిన ఘనులు



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

డోన్ టౌన్: పెద్ద పెద్ద నగరాల్లో సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ముఠాను డోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సెల్ ఫోన్ల దొంగతనాలకు పాల్పడే ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 41 సెల్ ఫోన్లు, 25 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని చిగురమానుపేటకు చెందిన ఎరుకలి కావడి లక్ష్మీనారాయణ, ఎరుకలి కావడి సాయికుమార్, ఎరుకలి ఉమేష్ చంద్ర, ఎరుకలి కావడి కుమార్, ఎరుకలి కావడి బాలు గుత్తిరోడ్డులోని రుద్రాక్ష గుట్ట వద్ద అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. జల్సాలకు అలవాటు పడిన వీరు తిరుపతి, చెన్నై, గుంటూరు, విజయవాడ, బెంగళూరు, విశాఖపట్నం, బళ్లారి, వివిధ పట్టణాల్లో సెల్ ఫోన్లను అపహరించి వాటిని హైదరాబాద్‌కు చెందిన ఖాజా నిజామొద్దీన్‌కు విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తుండేవారు. గత మూడేళ్లుగా దాదాపు 2,500 సెల్ ఫోన్లను అపహరించి ఖాజా నిజామొద్దీన్‌కు విక్రయించినట్లు విచారణలో తేలినట్లు సీఐ వివరించారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. సమావేశంలో పట్టణ ఎస్ఐలు శరత్‌కుమార్ రెడ్డి, నగేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్‌యూలో ముగ్గురు ప్రొఫెసర్ల తొలగింపు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో ముగ్గురు ప్రొఫెసర్లను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాసులు టెర్మినేషన్ (విధుల నుంచి తొలగింపు) ఆర్డర్లను జారీ చేశారు. తొలగించిన ప్రొఫెసర్లలో సుందరానంద పుచ్చ, విశ్వనాథరెడ్డి, భరత్‌కుమార్ ఉన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం, పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. టెర్మినేషన్ ఆర్డర్లను మెయిల్, స్పీడ్ పోస్టు, వాట్సాప్, పర్సనల్‌గా ఆ ప్రొఫెసర్లకు పంపించామని ఆయన చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సబ్జెక్టులను బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీని పిలుపుస్తామన్నారు. ఆ ప్రొఫెసర్లు చూస్తున్న శాఖల బాధ్యతలను వారి స్థానంలో నియమించిన ఆచార్యులకు అప్పగించాల్సి ఉంటుందన్నారు.

వృద్ధ దంపతుల కిడ్నాప్ యత్నం!

- ఆస్తి కోసం చిన్న కుమారుడి పన్నాగం
- చాకచక్యంగా నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



వృద్ధ దంపతులు నేసె లక్ష్మీదేవి, నాగేశ్వరరావు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

వెల్దుర్తి: వృద్ధ తల్లిదండ్రులను కిడ్నాప్ చేయించి, వారితో ఆస్తి రాయించుకునేందుకు వారి చిన్న కుమారుడు చేసిన యత్నాలు ఫలించలేదు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించడంతో నిందితులు దొరికిపోయారు. సోమవారం విధి నిర్వహణలో భాగంగా ఎస్‌బీ(స్పెషల్ బ్రాంచ్) కానిస్టేబుల్ ఖాజా వెల్దుర్తి మండలం మల్లెపల్లె గ్రామానికి వెళ్లాడు. ఒక చోట సుమో ఆగి ఉండటం.. కోడుమూరు నుంచి వచ్చి వారు వృద్ధ దంపతులు నేసె లక్ష్మీదేవి, నేసె నాగేశ్వరరావు ఇంటికి వెళ్లినట్లు తెలుసుకున్నాడు. చాటుగా వెళ్లి చూడగా... ఇంట్లో కోడుమూరు నుంచి వచ్చిన వారు బాండు పేపర్లు పరచగా..వృద్ధ దంపతులు ఏడుస్తూ కనిపించారు. కిడ్నాప్ యత్నాలు సాగుతున్నాయని తెలుసుకుని చాకచక్యంగా ఇంటి తలుపు మూసి గ్రామంలో పికెటింగ్ తనిఖీకి వచ్చిన సీఐ యుగంధర్‌కు సమాచారం అందించాడు. హుటాహుటిన సీఐ పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వృద్ధ దంపతుల చిన్న కుమారుడు చిన్న తిప్పరాజు, అతని వెంట వచ్చిన కోడుమూరుకు చెందిన నలుగురిని, సుమో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని తన కార్యాలయానికి తరలించారు. వృద్ధ దంపతుల చిన్న కుమారుడిని ఆస్తి కొరకు పుసిగొల్పి, కోడుమూరు రిజిస్ట్రేషన్ ఆఫీసు దగ్గర వెల్దుర్తి మండలం పుల్లగుమ్మికి చెందిన ఓ వ్యక్తి ఉన్నట్లు సీఐ విచారణలో తేలింది. అయితే తాము కిడ్నాప్ చేసేందుకు రాలేదని, పంచాయితీ చేసేందుకు వచ్చామని కోడుమూరుకు చెందిన సుంకన్న, హనుమంతు, మరో ఇద్దరు తెలిపారు. తమ పేరుపై కోడుమూరులో రూ.60లక్షల విలుజేసే ప్లాట్లు, మల్లెపల్లెలోని రూ.50లక్షల విలువజేసే ఐదు ఎకరాల భూమి ఉందని, ఆస్తిని తమ చిన్న కుమారుడు బలవంతంగానైనా లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నాడని వృద్ధ దంపతులు తెలిపారు. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా.. నిందితులను కాపాడేందుకు కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరిన కోడుమూరు మండలానికి చెందిన నేతలు పోలీసులపై తీవ్ర ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు సమాచారం.

అనధికార భవన నిర్మాణాలపై లోకాయుక్త సీరియస్

- సాక్షి కథనాన్ని సుమోటోగా విచారణకు తీసుకొన్న లోకాయుక్త
- కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌కు నోటీసులు



జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో అక్రమ, అనధికార భవన నిర్మాణాలపై లోకాయుక్త ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధలను అతిక్రమించి నిర్మాణాలు జరుగుతున్నా మునిసిపల్ శాఖ చోద్యం చూడడంపై ప్రశ్నల వర్షం కురిపించింది. నగరంలో దాదాపు 1,700 పైగా నిర్మాణాలు అక్రమంగా, అనధికారికంగా చేపట్టినా స్పందించకపోవడం.. టౌన్ ప్లానింగ్ అధికారులు మధ్యవర్తుల చెప్పు చేతుల్లో ఉండడంపై ఆగ్రహించింది. వెంటనే 1,700 వాణిజ్య సముదాయ భవనాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం కర్నూలు నగరంలోని భవన నిర్మాణాలపై సమగ్ర విచారణకు ఆ సంస్థ చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి ఆదేశించారు. తీసుకున్న చర్యలపై సెప్టెంబర్ 29వ తేదీన సమగ్ర నివేదిక సమర్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ విచారణ సమయంలో జిల్లా ఎస్పీ తగు సహాయ సహకారాలు అందించాలని నోటీసులో పేర్కొన్నారు.

సాక్షి కథనాన్ని సుమోటోగా స్వీకరణ

గత జూలై 7వ తేదీన సాక్షి దినపత్రికలో అనధికార, అక్రమ భవన నిర్మాణాలపై నిబంధనలకు పాతర..అక్రమాల జాతర శీర్షిక కథనం ప్రచురితమైంది. దాదాపు 1,700 భవనాలకు పార్కింగ్ లేదని, ఫలితంగా వాహనదారులు ఎక్కడికక్కడ రోడ్లపై ఉంచుతుండడంతో సాధారణ ప్రజలు ట్రాఫిక్, కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారనే కథనంపై సోమవారం లోకాయుక్త స్పందించింది. సుమోటోగా కేసు నమోదు చేసింది. అక్రమ, అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది.